వైయస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 16 మార్చి 2025

## మంత్రి లోకేష్ ఆదేశాలతో జ్యోతి క్షేత్ర కూల్చివేత భవనాల పునర్నిర్మాణ పనులు వేగవంతం



**పోరుమామిళ్ల రూరల్, మార్చి 15ప్రభాతవార్త:**
శ్రీ అవధూత కాశి నాయన మండలంలోని జ్యోతి క్షేత్రంలో ఇటీవల ఫారెస్ట్ అధికారులు కూల్చివేసిన భవనాలను మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి పర్యవేక్షణలో పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు కూల్చి వేసిన భవనాల పునర్నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.. జ్యోతి క్షేత్ర సమస్యపై మంత్రి స్పందించడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కాశిరెడ్డి నాయన భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. జ్యోతి క్షేత్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అతి త్వరలో కూల్చివేసిన భవనాలను పూర్తి చేసి పున ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ర్యాలీ

**దువ్వూరు, మార్చి 15, ప్రభాతవార్త:**
ప్రతి శనివారం పరిశుభ్రత చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో అందులో భాగంగా చింతకుంట గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ నిషేధించబడిన ప్లాస్టిక్ వస్తువులను వాడరాదన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం మానేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కాగితం, గుడ్డ సంచులు వాడాలన్నారు. అదేవిధంగా గ్రామంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, ఏఈ సుబ్రమణ్యం, శివ కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయండి





**రాయచోటి, మార్చి 15 ప్రభాతవార్త**
స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని వీరభద్ర స్వామి గుడి సమీపంలోని కూరగాయల మార్కెట్ నందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్ చంద్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ లతో కలిసి మూడవ శనివారం స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్రస్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచడంతోపాటు ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రతినెల మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్రస్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ పాల్గొని రాయచోటి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై అన్నమయ్య జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. కాలుష్య కారకాలైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి అన్నమయ్య జిల్లాకు ప్లాస్టిక్ రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకొని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

### హత్య జరిగి ఆరు సంవత్స రాలైనా

# దొరకని న్యాయం



**పులివెందుల,మార్చి15,ప్రభాతవార్త:**
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హ త్య జరిగి ఆరు సంవత్సరాలు అవుతున్న న్యాయం జరగలేదు అని నిందితులం దరూ బయట ఉన్నారని అందరూ తమ జీవితాన్ని గడుపుతున్నారని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కూతురు వైఎస్ సునీత అన్నారు. వైఎస్ వివేకా ఆరవ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్ కుటుంబ సమాధుల తోటలో వివేకా సమాధి వద్ద భర్త రాజశేఖర రెడ్డి మరియు కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ సునీత ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైయస్ వివేకానంద రెడ్డి హత్య జరిగితే ఇంతవరకు న్యాయం జరగలేదని పెద్ద వ్యక్తి విషయంలోనే ఇలా జరుగుతుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో తెలియలేదు అన్నారు. న్యాయం దక్కే వరకు న్యాయపోరాటం అయితే కచ్చితంగా చేస్తామన్నారు. ఈ కేసులో నిందితుల కన్నా తామే ఎక్కువ శిక్ష అనుభవి స్తున్నామన్నారు. ఈ కేసు లో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. సిబిఐ వాళ్ళు మళ్లీ ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతారని విశ్వాసం ఉందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ చేసే సమయంలోనే లోలోపల చాలా జరిగాయి అన్నారు. ఈ కేసులో న్యాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొంత సపోర్ట్ అయితే చేస్తామనని హామీ ఇచ్చారన్నారు. ఈ కేసులో ఉన్న సాక్షులందరూ లందరూ చనిపోతున్నారని, సాక్షులందరి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు ఆరా తీస్తూ వారి భద్రత అంతా చూసుకోవాలన్నారు .సాక్షుల మీద చాలా తీవ్ర ఒత్తిడి పెడు తున్నారని ఇలాంటివి జరగకుండా చూసుకోవాలి అన్నారు.

# టిడిపి కార్యకర్త దారుణ హత్య

### వేటకొడవలితో నరికిన వైసీపి కార్యకర్త

### పోలీసులు వైసీపీకి కొమ్ము కాస్తున్నారని బాధితులు నిరసన

**మదనపల్లెక్రైమ్, మార్చి 15 ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యాడు. వైసీపీకి చెందిన కొందరు తమపై కక్ష పెంచుకొని హత్య చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. టిడిపి సానుభూతి పరులమని తమపై క్రమంగా వైసీపీ కార్యకర్తలు దాడులు చేస్తున్నా పోలీసులు మాత్రం తాము ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వల్లే ఇంత దారుణం జరిగిందని ఆరోపించారు. మృతుడి భార్య ఉమాదేవి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు మండలం చంద్రమాకుల పల్లె పంచాయతీ కృష్ణాపురం కు చెందిన కాగితి రామకృష్ణ (51) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉన్నాడు. అదే ఊరికి చెందిన రామకృష్ణ సమీప బంధువు వెంకట్రమణ వైసీపి కార్యకర్తగా ఉండగా, ఇతని భార్య వైసీపి ప్రభుత్వంలో వాలంటీర్‌గా ఉండేది. కొంతకాలంగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడంతో రామకృష్ణ, అతని కుమారులు సురేష్, శివశంకర్, కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి గ్రామంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటుండగా వైసీపీ కార్యకర్తలు త్రిలోక్, వెంకటరమణ మరి కొంతమంది కలిసి సంబరాలు చేసుకుంటున్న వారిపైకి కారుతో ఢీకొన్నారు. ఆ సమయంలో రామకృష్ణ భార్య ఉమాదేవి గాయపడింది. 20 రోజుల క్రితం రామకృష్ణ తమ పొలానికి టిప్పర్లతో మట్టి తోలుకొంటుండగా నా ఇంటి ముందు టిప్పర్లు తిరగకూడదని గొడవకు దిగిన వెంకట్రమణ ఘర్షణ పడి రామకృష్ణ అతని కుమారుడు సురేష్ పై దాడి చేసి కొట్టాడు. శనివారం రామకృష్ణ కుమారుడు సురేష్ (31) గ్రామ సమీపంలోని వంగవీటి వద్ద ఉండగా, వెంకటరమణ బ్యాగులో కొడవలి తీసుకెళ్లి హత్యాయత్నం కు పాల్పడ్డాడు. పొలం పోతున్న రామకృష్ణకు విజయం తెలియడంతో వెంటనే సంఘటన స్థలానికి వస్తుండగా మార్గమధ్యంలో ఎదురైన వెంకటరమణ రామకృష్ణపై కొడవలితో నరికాడు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణ మదనపల్లి ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని తిరుపతికి రిఫర్ చేశారు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్ లో తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పలుమార్లు వెంకటరమణ తమ కుటుంబం సభ్యులపై దాడులు చేస్తున్న పోలీసులు పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. వైసీపీ నాయకులు తమపై దాడులకు తెగబడుతున్న, వారి వల్ల తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులను పలుమార్లు ఆశ్రయించినా ఫలితం లేదని, పైగా దాడులకు పాల్పడుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలకే పోలీసులు కొమ్ము కాయడంతోనే ఇంతటి దారుణం జరిగి కుటుంబ యజమాని దారుణ హత్య కాబడ్డాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. నిందితుడు వెంకట్రమణ ను వైసీపీ నాయకులు వేమారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గణపతి, మహేష్ తదితరులు రెచ్చగొట్టి, మేము ఉన్నాం చూసుకుంటాములేనని ధైర్యం నూరిపోయడం వల్లే వెంకటరమణ శనివారం ఉదయం దుకాణం వద్ద ఉన్న సురేష్ పై వేటకొడవలితో దాడి చేసి హత్య చేసేందుకు తెగబడ్డారన్నారు. ఈ ప్రమాదంలో సురేష్ తప్పించుకునే ప్రయత్నంలో చేతిపై కొడవలి వేటు పడడంతో గాయం కాగా, రక్తస్రావంతోనే పరుగులు పెట్టాడన్నారు. పుంగనూరు పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహమును శవ పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులను పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమర్నాథరెడ్డి అమర్నాథ్ రెడ్డి, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపేట రమేష్, పుంగనూరు టిడిపి ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి లు పరామర్శించారు. న్యాయం చేయాలంటూ రాస్తోరోకో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంవల్లే ఇంత దారుణం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డు పై బైఠాయించి, ధర్నా, రాస్తోరోకో చేశారు. వైసీపీ నాయకులు, నిందితులకు పోలీసులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె సీఐ లు ఎరిషావల్లి, కళా వెంకట్రమణ లు ఎంత చెప్పినా ఆందోళన విరమించలేదు. దీంతో పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లాబాబు తాను అండగా ఉంటానని బాధితులకు చెప్పడంతో ఆందోళన విరమించారు. భాధితులతో ఫోన్ లో మాట్లాడిన హోమ్ మంత్రి అనిబాధితులతో హోమ్ మంత్రి అనిత ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు జరిగిన సంఘటనను హోమ్ మంత్రి అనిత కు వివరించడంతో కార్యకర్తలకు భరోసా ఇస్తూ నిందితులను కఠినంగా శిక్షించడం తో పాటు బాధితులకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు.



రామకృష్ణ ( ఫైల్ ఫోటో)



రోడ్డపై బైఠాయించి ధర్నా, రాస్తోరోకో చెస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

## కన్నుల పండువగా ప్రసన్న వేంకటేశ్వరుని కళ్యాణం



**బద్వేలు అర్బన్, మార్చి15 (ప్రభాతవార్త) :**
బద్వేలు మండల పరిధిలోని లక్ష్మిపాళెంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో బాగంగా శనివారం ఏడవ రోజు వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతేగాక స్వామివార వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బద్వేలు పట్టణ పరిసర ప్రాంతాలవారు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దేవాదాయ కార్యనిర్వహణాదికారి రామలింగారెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ చాటకొండు సత్యసంజీవ్‌కుమార్, ధర్మకర్తలు భూపాళం రాఘవేంద్ర, కర్ణమడకల బీనా, నల్లి వీరమ్మ,సంపతి వెంకటసుబ్బయ్య, అనగొంది ఓబులేసు, ఒంటె చిన్న పీరయ్య, నాగయ్యగారి సిద్దమ్మ, మజ్జారి లక్షుమ్మ, మరియు గ్రామస్థులు భక్తులకు స్వామివారికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి స్వామివారిని గజ వాహనంపై ఊరేగించారు. స్వామి వారికిఅడుగడుగునా మంచినీరు వారుపోసి తమభక్తిని చాటుకున్నారు ప్రత్యేక ఉభయదాతలుగా కీ.శే.వేదాంతచార్యులు కుమారుడు కీ.శే. నరసింహాచార్యులు కుమారులు కె.ఎల్.ఎన్.ప్రసాద్, వరదరాజ్, నందకిశోర్, శేషశయనం, కన్యాదాత సాంగ్యపరులుగా తిరువెంగళాపురం కీ.శే. పి .గురవయ్య భార్య నరసమ్మ, కుమారులు కీ.శే. సుబ్బరాయుడు, శ్రీనివాసులు బాలక్రిష్ణయ్య, రామయ్య, కీ.శే.వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు



**రాయచోటి, మార్చి 15 ప్రభాతవార్త**
ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నమండెం టౌన్ మోతినగర్ నందు 7.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దరమే తమ లక్ష్యమన్నారు. దీంతో ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలవలు, వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నేడు మోతినగర్ లో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం మంత్రివర్యులు గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు 2, లక్షలతో ఏర్పాటుచేసిన నూతన మోటారును స్విచ్ ఆన్ చేసి గ్రామానికి నీటి సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణది పూర్తిగా రాజకీయ హత్య

### పోలీస్ వ్యవస్థలో మార్పులు రావాలి

### రాష్టంలో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

### పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి

**మదనపల్లె క్రైమ్, మార్చి 15 ప్రభాతవార్త.**
పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి పంచాయతీ లక్ష్మీపురం లో జరిగిన టిడిపి కార్యకర్త రామకృష్ణ హత్య పూర్తిగా రాజకీయ హత్యేనని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రత్యర్థి, వైసిపి కార్యకర్త వెంకటరమణ చేతిలో దారుణ హత్యకు గురైన రామకృష్ణ మృతదేహాన్ని చూసేందుకు పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, పుంగునూరు టిడిపి ఇన్చార్జి, చల్లాబాబు, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. మార్చురీలో ఉన్న రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి, దాడిలో గాయపడిన మృతుడి కుమారుడు సురేష్ ను పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా అమర్నాథ్రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైనా వైసిపి నాయకులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు అంతు లేకుండా పోతోందన్నారు. అందుకు పర్యవసానమే టిడిపి నాయకుడి రామకృష్ణ హత్య అన్నారు. గత 15 ఏళ్ల క్రితం లక్ష్మిపురం టిడిపికి కంచుకోట ఉండేదన్నారు. పుంగునూరు నియోజకవర్గానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చిన తర్వాత ఫ్రాక్షన్ ప్రోత్సహించడంతో దాడులు, దౌర్జన్యాలు జరగడం పరిపాటిగా మారాయన్నారు. అధికారాన్ని కోల్పోయినప్పటికీ పెత్తనం చెల్లాయించాలని, లేదంటే పుట్టగతులుండవు, భవిష్యత్తు ఉండదని ఇలాంటి సంఘటనలకు దిగుతున్నారని, ఇది చాలా విచారకరమన్నారు. ఈ సంఘటన వల్ల ఎస్సైని సస్పెండ్ ఇది సమసిపోయే సమస్య కాదన్నారు. పోలీసు వ్యవస్థలో మార్పు రావాలని, పై స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తే గాని ఈ సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. ఇది పూర్తిగా రాజకీయ హత్యగానే భావించాల్సి వస్తోందన్నారు. మరోసారి రాష్టంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

## జిల్లా ప్రణాళికలను సిద్ధం చేయండి



**రాయచోటి, మార్చి 15 ప్రభాతవార్త**
అన్నమయ్య జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రణాళికకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలకు మరియు 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలు డాక్యుమెంటరీ సిద్ధం చేసి సమర్పించాలన్నారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాల పైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ రూపకల్పన చేసుకోవాలన్నారు. లక్ష్యాలకు తీసుకోవలసిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రణాళికలో భాగంగా ఆయా శాఖలలో అమలు చేయాల్సిన ప్రధానమైన కార్యక్రమాలు ఏమిటి, ప్రతి అంశానికి సంబంధించి వాటి పరిమితులు, వాటి ప్రధాన లక్ష్యం, ఉప లక్ష్యాలు, చేపట్టాల్సిన అంశాలు, లక్ష్యసాధనకు తీసుకోబోతున్న చర్యలు తదితరాలలో శాఖల వారీగా జిల్లా అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై రివ్యూ నిర్వహించారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ 11ఏళ్ళ పాలనలో దేశాభివృద్ధి శూన్యం

**మదనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :**
ప్రధానమంత్రి నరేంద్రమోడీ 11ఏళ్ళ పాలనలో పదివేల జతల బట్టలు మార్చాడే తప్పా దేశాభివృద్ధికి చేసింది శూన్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని బెంగుళూరురోడ్డులో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్‌తో కలసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మదనపల్లెను స్వర్గలోకంగా అభివర్ణించారు. ఇక్కడ ఉన్న వాతావరణం ఎక్కడా లేదని 1905 లోనే ఆంగ్లేయులు శానిటోరియం వద్ద టిబి ఆసుపత్రిని నెలకొల్పి ఎన్నో వేల ప్రాణాలను కాపాడారన్నారు. ప్రపంచంలో ఎక్కడా టిబికి చికిత్స లేదని, ఆ వ్యాధి సోకిన వారు మరణించే పరిస్థితి ఉండేందన్నారు. అలాంటి సమయంలో శానిటోరియం వద్ద టిబి ఆసుపత్రిని ఏర్పాటు చేశారన్నారు. అదే విధంగా మదనపల్లె బిటి కళాశాల గురించి దేశంలో తెలియని వారు ఉండరన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇక్కడే జాతీయగీతాన్ని బెంగాలి నుంచి ఆంగ్లలోకి అనువదించారన్నారు. బిటి కళాశాల, శానిటోరియం రెండు అధ్వాన్నపు స్థితిలో ఉండడం భాదాకరమన్నారు. సనాతన ధర్మం అంటే గంగానదిలో మునగడం, ఊగిపోవడం, అయోధ్యలో ధండం పెట్టడం కాదని పవన్‌కళ్యాన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి

## పూడిక తొలగింపులో నిర్లక్ష్యం... విజృంభిస్తున్న దోమలు,

**మైదుకూరు, మార్చి 15, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ పట్టణ ప్రాంతం మెరుగైన పరిసరాల కల్పనలో విఫలమవుతుంది. మున్సిపాలిటీ పరిది లోని ప్రజలు అసౌకర్యాల నడుమ జీవిస్తున్న ప్రజా సమస్యలపై వార్డు ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా నంద్యాల రోడ్డు అనుకుంటా మీదుగా బద్వేల్ రోడ్డు దాటుకొని కడప రోడ్డు మీదుగా వెళుతున్న పంట కాలువ ఆక్రమణలకు గురి కావడం పూడిక తీత తొలగింపులో నిర్లక్ష్యం సంబంధిత పారిశుధ్య అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం వలన పూడిక పనులు చేపట్టలేదు. కడప రోడ్డు ప్రధాన రహదారి జిల్లా పరిషత్ హై స్కూల్ పరిధిలోని నివాసాల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది డ్రైనేజీలో పూడికలు సక్రమంగా తొలగించడం లేదని స్థానిక ప్రజలు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామమాత్రంగా జెసిపి సహాయంతో కొంతవరకు పూడిక తొలగించిన పూర్తిస్థాయిలో తీయకపోవడంతో విజృంభిస్తున్న దోమలు ఒకవేళ సిబ్బంది వచ్చి పూడికలను వచ్చి తీసిన ఎక్కడ పడితే అక్కడ గుట్టలు గుట్టలుగా ఉంచేస్తున్నారు. వాటిని తీసుకెళ్లడంలో రెండు మూడు రోజుల తర్వాత వచ్చి తరలిస్తున్నారు. దీనివలన దుర్వాసన పెరుగుతుంది ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రహరీ గోడ వార వెంట దుర్వాసన పెరుగుతుంది. పూడికతీత తీయకపోవడంతో పందులు బెడద దోమల బెడద పెరుగుతుంది సమస్యలపై స్పందించి పారిశుధ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.



## 17న కరెక్షన్స్ కు అవకాశం

కడప మార్చి 15 ప్రభాతవార్త

మాజీ సైనికులకు చెందిన రికార్డు సంబంధమైన కరెక్షన్స్ ని సరిదిద్దడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సైనిక సంక్షేమ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఫిలిఫ్ ప్రకటనలో తెలియజేశారు. కడప నగరంలోని సైనిక సంక్షేమ భవనం దగ్గర ఈనెల 17 సోమవారము ఉదయం 9 గం ల నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించబడనని వారు పేర్కొన్నారు. పదవి విరమణ చెందిన సైనిక కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విజయవాడ మిలటరీ అధికారులు ,ఉపాధ్యక్షులు పులి వెంకట్, ముఖ్య కార్యదర్శి మధుసూదన్ రావు,రాష్ట్ర కమిటీ సభ్యులు ఎల్లారెడ్డిపాల్గొంటున్నారని మాజీ సైనికులు కుటుంబాలు తప్పకుండా హాజరుకావాలనన్నారు.

## విద్యార్థినిలకు దుస్తుల పంపిణీ



బద్వేలు, మార్చి 15, ప్రభాతవార్త

బద్వేల్ మండలంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మరియు బి.మఠం లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నందు చదువుతున్న బాల బాలికలు 976 మందికి పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్ రెడ్డి, డాక్టర్. గీతా దంపతులు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చిన్న బహుమానంగా ఈ దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయినిలు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి.

చిట్వేలి, మార్చి 15, ప్రభాతవార్త:

ఈనెల 17 నుంచి నిర్వహించనున్న పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఎంఈఓలు కోదండ నాయుడు, ఈశ్వరయ్య లు తెలిపారు. ఈ ఏడాది చిట్వేలి మండలానికి సంబంధించిన మూడు పరీక్ష కేంద్రాలను జిల్లా ఉన్నత పాఠశాలలోనే నిర్వహిస్తున్నామన్నారు. ఏ సెంటర్ నందు 245 మంది, బి సెంటర్ నందు 234 మంది, సి సెంటర్ నందు 160 మంది మొత్తం 639 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షా సమయానికి 30 నిమిషాలు ముందుగానే చేరుకోవాలన్నారు. హాల్ టికెట్ తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణతను సాధించాలని వారు తెలిపారు.

## మొయిళ్లకాల్వలో ఘనంగా ఉరుసు

పెండ్లిమర్రి, మార్చి 15, ప్రభాతవార్త:

మండలంలోని మొయిళ్లకాల్వలో శనివారం ఘనంగా ఉరుసు కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఉరుసు సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించడంతో వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తెదేపా నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గంగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేదించుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.

లక్కిరెడ్డిపల్లె : మార్చి 15 ప్రభాత వార్త



ప్లాస్టిక్ నబీ నిషేదిద్దాం... పర్యావరణాన్ని కాపాడదం అని ఇన్చార్జీ ఎంపిడివో ఉషారాణి పేర్కొన్నారు. స్వర్ణాస్వచ్ఛాంధ్ర కార్య క్రమంలో భాగంగా శనివారం 16 గ్రామ పంచాతీయతీలలో పాటు లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వలన ఎన్నో అనార్థాలు ఉన్నాయని ప్లాస్టిక్ కవర్ల వల్ల మానవాళికి ముప్ప ఉంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేదించారని దుకణాదారులు ప్లాస్టిక్ వాడితే జరిమాని విదిస్తామని ఆమె హెచ్చరించారు. గ్రామాలల్లో పారిశుద్యం మెరుగుపరచాలని స్వచ్ఛత గ్రామాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో తాశిల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, పంచాయతీ సెక్రటరీ లు సుదర్శన్ రెడ్డి, రజనీష్ రెడ్డి , మద్దిరేవుల సర్పంచ్ చంద్రమ్మ, ఉపాధి ఏపివో డిల్లీబాబు, మహిళాసంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

## ఫాల్గుణ మాసంలో శ్రీ వారికి ప్రత్యేక పూజలు





బద్వేలు అర్బన్, మార్చి15, ప్రభాతవార్త :

పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన,పూజ కార్యక్రమాలతో పాటుస్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. శనివారం నాటి పూజలలో ప్రత్యేక అభిషేక దాతలుగా లక్ష్మి నారాయణరెడ్డి, సతీమణి స్వర్ణలత, జలనీల శ్రీనివాసులు సతీమణి రాజేశ్వరి, పెద్దిరెడ్డి వెంకట సుధాకర్ సతీమణి వసంతలక్ష్మి కుటుంబ సభ్యులకు స్వామి వారి సన్నిధిలో విశేష పూజలు చేయగా, ప్రత్యేక ఉభయదాతలుగా గొడిసిపాటి అంకయ్య సతీమణి రుక్మిణి, కొణతాలపల్లి శ్రీనివాసులు సతీమణి వెంకటలక్ష్మి, ఎ.వెంకట సురేష్ సతీమణి అనూష, జింకా వెంకట నరసయ్య సతీమణి హరిత కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వర స్వామి వారిని పలువురు భక్తులు, భక్తి, శ్రద్దలతో స్వామివారినిదర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయ నిర్వాహకులు వి.వి.రమణ పలువురు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## విజయ వంతమైన ఆవిర్భావ దినోత్సవం

వేంపల్లి, మార్చి 15, ప్రభాతవార్త :

పిఠాపురం లో శుక్రవారం జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ సక్సెస్ అయ్యిందని, అందులో తమ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారని ఆ పార్టీ పులివెం దుల నియోజ కవర్గ సీనియర్ నేత డాక్టర్ దాసరి రవిశంకర్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వీర మహిళలు హాజరైనట్టు చెప్పారు. తాము కూడా అన్నమయ్య,కడప జిల్లాల నుంచి వేలాది మంది తరలి వెళ్లామని చెప్పారు. పులివెందుల నియో జకవర్గం నుంచి దాదాపు 1000 మంది హాజరైనట్టు చెప్పారు. ఆవిర్భావ సభలో తనతో పాటు పొలిశెట్టి సాయి, నాగ మల్లికార్జున, మహేష్, మహబూబ్ బాషా, సంపత్, హరినాథ్, లక్ష్మీ నారాయణ, ఉమర్ , ప్రసాద్ తదితరులు ఉన్నారని చెప్పారు.



## యాజమాన్యపద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె; మార్చి 15, ప్రభాతవార్త



రైతులు యాజమాన్యపద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చుని ఏడిఏ జయరాణి పేర్కొన్నారు. జాతీయ మిషన్ వంటనూనెలు, మరియు నూనెగింజలు పథకం కింద డివిజన్ స్టాయిలోని వీరబల్లి, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాలకు రైతులకు శనివారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ నూనె గింజల ఉత్పత్తిని ఉన్నం మరియు సూర్మపోషకాలు, అందిచడం ద్వారా అధిక దిగుడబడులు సాదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణాకేంద్రం ఏఓలు రామ క్రిష్ణరాజు, సుచిత్ర, స్వాతి, ఏఈఓ పంతోషమ్మ, అనూష కెరోలిన్, చాన్భాష, రమేష్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

జమ్మలమడుగు, మార్చి 15, ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని 6 మండలాల్లో ఏ పంచాయతీలో అయినా మున్సిపాలిటీలో అయినా ప్రజల నుంచి ఏ సమస్యపై ఫిర్యాదు వచ్చినా వాటిని సంబంధిత అధికారు పరిష్కరించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గంలోని ప్రజలతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లోని ఆయా సమస్యలపై భూపేష్‌రెడ్డికి ప్రజలు వినతులు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి సంబంధిత అధికారులకు వెంటనే ఫోన్ చేసి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించాలని ప్రజను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ విజయవంతం

కలికిరి, మార్చి 15, ప్రభాతవార్త:

మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో శనివారం ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఎంపీడీఓ భానుమూర్తిరావు, ఈ వోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్ పర్యవేక్షణలో విజయవంతమైంది. ఈ సందర్భంగా కలికిరి మేజర్ పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎల్లయ్య, ఈవో అశోక్, టీడీపీ యువ నాయకుడు ఆర్.యోగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని, పీడీ వెంకట రత్నం, ఎంపీడీవో భానుమూర్తిరావు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, గుండ్లూరులో సర్పంచ్ సైఫుల్లా, అద్దెవారిపల్లె పంచాయతీలో సర్పంచ్ గంగయ్య, పారపట్లలో అరుణ, పత్తేగడ పంచాయతీలో సర్పంచ్ రెడ్డమ్మల ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం ర్యాలీని గ్రామాల్లో నిర్వహించి ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, చాముండేశ్వరయ్య, అదే విధంగా పంచాయతీ కార్యదర్శులు నవాజ్‌బాషా, తిమ్మారెడ్డి, గోపీ, సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌కు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించడంతో కార్యక్రమం విజయవంతమైంది.

## ఘనంగా కాన్షీరామ్ జయంతి వేడుకలు

మదనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న దృశ్యం

కాన్సీరామ్ 91వ జయంతి వేడుకలు బహుజన యువసేన(బివైఎస్) ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నందు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా సాహుమహరాజ్, నారాయణగురు, పెరియార్, అంబేద్కర్‌ల ప్రబోదనాలను రాజ్యాధికారం వైపు నడిపి ఎన్నో విజయాలను సాధించిన గొప్ప నాయకుడు కాన్సీరామ్ అని కొనియాడారు. దేశాభివృద్దికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. దేశమంతా కులాన్ని నిర్మూలిద్దాం, బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ ఉద్యమాలు చేస్తూ బహుజనులకు రాజ్యాధికారి అందించిన గొప్ప వ్యక్తి అన్నారు. యువత కాన్సీరామ్ అడుగుజాడల్లో నడచాలన్నారు. ఈ కార్యక్రమంలోబివైఎస్ నాయకులు ఆది, జగదీష్, ద్వారక, శశికుమార్, బాలక్రిష్ణ, వినయ్, బ్రహ్మ, జశ్వంత్ ఉదయ్ పాల్గొన్నారు.

## చైతన్య స్వచ్ఛందసంస్థలో వినియోగదారులు సదస్సు

మదనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పట్టణ సమీపంలోని దేవతానగర్‌లో ఉన్న చైతన్య సచ్చంద సేవా సంస్థలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల సదస్సు శనివారం నిర్వహించారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఎంపి ఆనందన్, డాక్టర్ జివిఎస్.బాబు, జనరల్ సెక్రటరీ కవితారాణిలు పాల్గొని మాట్లాడారు. ఏ దేశాభివృద్ధికైనా విద్యావిదానం వెన్నుముకతో సమానమన్నారు. వినియోగదారులు తమకున్న హక్కులు తెలుసుకొని చట్టప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. పరిష్కరించుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ప్రపంచ వినియోగదారుల కోసం ఏర్పడిందన్నారు. ఈ హక్కులను వినియోగదారుడు వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాధి బాలజ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు పట్టణ గిరిజామాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

కలికిరి, మార్చి 15, ప్రభాతవార్త:

ఉపాధి హామీ పథకం పనులను సమర్థవంతంగా నిర్వహించాలని డ్వామా పీడీ వెంకట రత్నం అన్నారు. అన్నమయ్య జిల్లా కలికిరి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం కూలీల వలసల నివారణకు ఉపాధి హావమీ పథకం ప్రవేశపెట్టిందని కూలీలకు వంద రోజులు పని కల్పించే విధంగా ఉపాధి సిబ్బంది ముందు ఉండాలన్నారు. నిబంధనల మేరకే పనులు చేపట్టాలని నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం డీఆర్పీలు మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనుల వివరాలను గ్రామ స్థాయిలో చేపట్టిన తనిఖీ వివరాలను వెల్లడించారు. ఈ తనిఖీలలో గుర్తించిన అక్రమాలను రూ.3లక్షలు మేర రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. మండలంలోని 14 పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులలు అత్యధికంగా మేడికుర్తి, చీకటిపల్లె పంచాయతీలలో అవినీతి ఎక్కువగా జరిగినట్లు సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడైంది. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో 13.99 పనులకు గాను రూ.7,84,32,787 ప్రభుత్వం ఖర్చు చేసింది. ఆ పనులకు సంబంధించి శనివారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలో రూ.3,35,935 రికవరీ చేయడం జరిగింది. పత్తేగడ పంచాయతీలో రూ.39,971, మర్రికుంటపెనట రూ.వెయ్యి, పల్లవోలు పంచాయతీలో 3022, పారపట్లలో రూ.12806, గుట్టపాలెం 3663, కలికిరి పంచాయతీలో రూ.771, మునోళ్లపల్లె పంచాయతీలో రూ.208131, మేడికుర్తిలో రూ.108429, చీకటిపల్లె పంచాయతీలో రూ.10491, టి.సంద్రవారిపల్లె పంచాయతీలో రూ.3732, మహల్‌లో రూ.14474, గుండ్లూరు రూ.18206, అద్దెవారిపల్లెలో రూ.4107, మొత్తం రూ.3,35,935 రికవరీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## రీచర్చ్ ఫండింగ్‌లపై అవగాహన సదస్సు

కురబలకోట, మార్చి 15 ప్రభాతవార్త :

అంగళ్ళుకు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో రీచర్చ్ పండింగ్ అవకాశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణారెడ్డి తెలిపారు. ముఖ్య అతిథి ప్రొపెసర్ ఎం.రవిశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో రీచర్చ్ ఫండింగ్ అందులో అవకాశాలను ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇండియా, జర్మని ఇతర దేశాల రీచర్చ పండింగ్ ఏజెన్సీ వివరాలను కార్పోరేట్ రంగాలకు దీటుగా ఉందని వివరించారు. ఛైర్మెన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు తమ మేథో సంపత్తి ద్వారా రీచర్చ్ పండింగ్ అశాకాశాలను వినియోగించి కళాశాలను ఉన్నతస్థాయికి తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణారెడ్డి మాట్లాడుతూ రీచర్చ్ పండింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించడం వల్ల పండింగ్ అవకాశాలు అధ్యాపకులకు దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ బిడి.వెంకటరమణారెడ్డి, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జూదరులు నలుగురు అరెస్టు

నిమ్మనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం గ్రామ పంచాయితీ కేంద్రమైన సామకోటివారిపల్లె సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపార. వీరితో పాటు రూ.3420 స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

## స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం

నిమ్మనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వం నూతనంగా చేపట్టిన స్వచ్ఛ ఆంద్రా, స్వచ్ఛాభారత్ కార్యక్రమాన్ని నిమ్మనపల్లెలో ఘనంగా శనివారం నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లును వాడరాదన్నారు. చెత్తాచెదారాలను బస్టాండు ప్రాంతంలో తొలగించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్,ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, ఏఓ రమేష్, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ మిథున్‌చక్రవర్తి, ఏపిఓ మురళి, మండల మాజీ టిడిపి అధ్యక్షులు రాజన్న, స్థానికులు పాల్గొన్నారు.

## వైభవంగా జమాలయ్య ఉరుసు ఉత్సవాలు

దువ్వూరు, మార్చి 15, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ జమాల్‌వల్లి స్వామి ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు ఉత్సవాలు మొదలు కాగా ఈ ఉత్సవాల్లో ఎక్కవ సంఖ్యలో భక్తులు దర్గాను దర్శించుకున్నారు. ఈ సంధర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. జమాలయ్య స్వామి దర్గాను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే ఉరుసు ఉత్సవాల సంధర్భంగా బండలాగుడు పోటీలను ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటుచేశారు.

## కామెర్ల వ్యాధితో కార్యకర్త మృతి

సిద్దవటం, మార్చి 15, ప్రభాతవార్త:

కామెర్ల వ్యాధితో జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త బీగాల వాసు గత కొన్ని రోజులుగా అనారోగ్యాలతో కడపలో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటూ శనివారం ఉదయం మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. జనసేన పార్టీ విజయం కోసం పవన్ కల్యాణ్ ఆశయాలతో గత 10 సంవత్సరాలుగా పార్టీ విజయం కోసం కష్టపడి అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని జనసైనికులు, వీర మహిళలు తెలిపారు. కూటమి క్రియాశీలక కార్యకర్త మృతి పట్ల కూటమి నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూటమి పార్టీ క్రియాశీలక కార్యకర్త మృతి పట్ల, జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బి.హరిప్రసాద్, పంచాయతీరాజ్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర పార్టీ నేతలతో మాట్లాడి ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మంచి కార్యకర్తను కోల్పోయామని వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని తెలిపారు.

## పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం

సిద్దవటం, మార్చి 15, ప్రభాతవార్త:



పరిశుభ్రతతో అంటు వ్యాధులు దూరమవుతాయని సిద్దవటం సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రకాష్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ప్రభుత్వాసుపత్రిలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం ప్రభుత్వాసుపత్రిలో ప్రతి 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిం చడం జరుగుతుందన్నారు. పరిశుభ్రతపై ప్రభుత్వం సాసా యాప్‌ను రూపొం దించడం జరిగిందన్నారు. సిద్దవటం ప్రభుత్వాసుపత్రిలోని సిబ్బందికి పరి శుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి అవగాహన కల్పించడం జరి గిందన్నారు. సిబ్బంది ఆసుపత్రిలో తడి చెత్తను, పొడి చెత్తను, ప్లాస్టిక్, తదితర వస్తువులను వేరు చేసి వేర్వురుగా డస్ట్‌బిన్‌లలో వేయడంపై అవగాహన కల్పించామన్నారు. ఆసుపత్రి ఆవరణలో తొలగించిన చెత్తా చెదారాన్ని తొలగించి సాసా యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బైకు డీ వ్యక్తి మృతి.

చిట్వేలి,మార్చి 15, ప్రభాతవార్త:

చిట్వేలి గుంజననది బ్రిడ్జి, పెట్రోల్ బంకు సమీపంలో శనివారం బైక్,ట్రాక్టర్ ఢీ కొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందారు. ఎస్సై రఘురాం తెలిపిన సమాచారం మేరకు తిమ్మయ్య గారి పల్లి దళితవాడకు చెందిన వల్లెం పాపయ్య (40) చిట్వేలి ఉన్నత పాఠశాలలో తమ బిడ్డ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో పాల్గొని స్వగ్రామానికి వెళుతూ ఉండగా పెనగలూరు మండలం, రాచవారి పల్లి గ్రామానికి చెందిన నువ్వుల నరేష్ (30) ఇసుక ట్రాక్టర్‌తో చిట్వేలికి వస్తూ బైక్ ను డీ కొనడంతో పాపయ్య గాయపడ్డారన్నారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగాచికిత్స పొందుతూ పాపయ్య మరణించాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రఘురాం తెలిపారు.

## బహుజనుల ఆశా జ్యోతి కాంతిరామ్

దువ్వూరు, మార్చి 15, ప్రభాతవార్త:

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాంతిరామ్ అని జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు జయరాం అన్నారు. శనివారం బహుజన సమాజ్ వాది పార్టీ కార్యాలయంలో కాంతిరామ్ 91వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఆశయాలను తెలియజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజకీయ వ్యవస్థలో సామాజిక సమానత్వ సిద్ధాంతకర్త కాంతిరామ్ అని ఆయన ఆధ్వర్యంలో ఉత్తరప్రదేష్ ముఖ్యమంత్రిగా మాయావతి బాధ్యతలు చేపట్టారన్నారు. బహుజనుల రాజ్యం రావాలని కాంతిరామ్ నిరూపించుకు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ కుమార్, బేబి, జయరాం, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం

సుండుపల్లి, మార్చి 15, ప్రభాతవార్త:

మండలం మడితాడు యూనిట్ లోని మడితాడు గ్రామ సమాఖ్య సంఘం 4సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సి సి రమణ మాట్లాడు తూ తక్కువ ఖర్చు తో, ప్రకృతి లో లభించే వనరులు లు ను ఉపయోగించి, కాషాయాలు, ద్రవ ణా లుతయారు చేసుకొని పంటలు పందించు కోవాలని వివరించారు అనంతరం యూనిట్ ఇంచార్జి ఎస్. వెంకటయ్య నీమాస్త్రం తయారు విధానం, గురించి, వివరించారు. ఇందులో ఐసీ ఆర్ పి లు నాగలక్ష్మి, లక్ష్మీదేవి, మహిళసంఘం సభ్యులు, యానీమాటర్ నాగమునెమ్మ పాల్గొన్నారు

## వైఎస్ వివేకాకు ఘనంగా నివాళులు

### పాల్గొన్న వైఎస్ సునీత మరియు కుటుంబ సభ్యులు



పులివెందుల,మార్చి 15,ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాల రోడ్డు లో వున్న వైఎస్ కుటుంబ సమాధుల తోటలో మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా వివేక సమాధి వద్ద భార్య సౌబగ్యమ్మ ,కూతురు వైఎస్ సునీత ,నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి ,మరియు కుటుంబ సభ్యులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఫాస్టర్ సమక్షంలో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద రెడ్డి అభిమానులు ,ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ళు అరెస్ట్..

సుండుపల్లి, మార్చి 15, ప్రభాతవార్త:

మండల పరిధిలోని బాగంపల్లె పంచాయతీ నల్ల మేకల పల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 4000/ లు నగదు,2 ద్విచక్ర వాహనాలు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే మడితాడు గ్రామపంచాయతీ దిగువ నాయునివారిపల్లె సమీపంలో చిన్న చెరువు వద్ద జూదం ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.5400/ నగదు,4 ద్విచక్ర వాహనాలు,9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

## బస్ షెల్టర్లను రోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల,మార్చి 15, ప్రభాతవార్త:

ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే ప్రజలు ,రోగులు బస్ షెల్టర్లను సద్వినియోగం చేసుకోవాలని , నియోజక వర్గంలో ఎక్కడ సాగు ,త్రాగు నీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటా మని,చక్రాయ పేటలో తీవ్ర నీటి ఎద్దడి నివారణకు బోర్లు ఏర్పాటు చేయడం జరిగిందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం కడప రోడ్డులోని వైయస్సార్ ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్ లను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో ఉన్న ఏరియా ఆసుపత్రిని కడప రోడ్డులోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోనికి మార్చడం వల్ల ప్రతిరోజు నిత్యం వందల మంది రోగులు, రోగులతో పాటు వచ్చే సహాయకులకు మెడికల్ కాలేజ్ నందు బస్ షెల్టర్లు లేక చాలా ఇబ్బందులు పడటం జరుగుతోందన్నారు. ఇటీవల మెడికల్ కాలేజ్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో అక్కడి రోగులు మరియు సిబ్బంది బస్సు షెల్టర్లు లేవని నా దృష్టికి తీసుకొచ్చారని వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రోడ్డుకు రెండు వైపులా బస్సు షెల్టర్లను నిర్మించాలని కోరడంతో జరిగింది అని దీనితో జిల్లా కలెక్టర్ బస్సు షెల్టర్‌ల నిర్మాణం కొరకు 19 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందిని అన్నారు. త్వరిత గతిన బస్ షెల్టర్లు నిర్మాణం చేపట్టిన జేఎంజే నిర్మాణ గుత్తేదారులు ఎస్ నరసింహా రెడ్డి మరియు మల్లెల శ్రీనివాసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్ అండ్ బి ఈఈ మాధవి, డిఈ జగదీశ్వర్ రెడ్డి ఆర్ అండ్ బి అధికారులుమోపురి దేవాలయం చైర్మన్ వెంకట రమణారెడ్డి తొండూరు మాజీ మండల అధ్యక్షుడు ఎమ్. రమణారెడ్డి కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి,బిజెపి నాయకుడు భాను ప్రకాష్ మరియు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర

బ్రహ్మం గారి మఠం మార్చి 15 ప్రభాతవార్త:

ప్లాస్టిక్ కవర్లు, సంచులు వాడడం వల్ల పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉందని , అందువల్ల ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలని ఎంపీడీవో వెంగమునిరెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో వెంగమునిరెడ్డి మండల కేంద్రంలోని పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.


**CHANGE OF NAME**

● I, Narappagari Eswar Reddy(OLD NAME), s/o Narreddy Narappagari Veera Reddy Late(OLD NAME), a resident of 12/643, Kota street, Proddatur, YSR District, A.P-516360. I hereby declare that me and my father's name has been changed to NARAPPAGARI ESWARA REDDY(New name) S/o Veera Reddy N ( new name).

**CHANGE OF NAME**

● I, Kamanuru Venkata Narayanamma, W/O Narappaagari Eswara Reddy(old name) resident of 12/643, Kota street,Proddatur, YSR District , A.P-516360. I hereby declare that my husband name is being changed to Narappagari Eswara Reddy(new name).

**సర్టిఫికెట్స్ పోయినవి**

మూడే యుగంధర్ నాయక్, తండ్రి భాస్కర్ నాయక్, అడ్రస్: 1/201-A నియర్ వెలుగు స్కూల్ వీధి, లక్కిరెడ్డిపల్లె (మం) రాయచోటి అన్నమయ్య (జిల్లా) ఏ.పీ., ఒరిజినల్ పదవ తరగతి సర్టిఫికెట్ పోయినది దొరికిన వారు పై అడ్రస్ కు ఫోన్ ద్వారా తెలుపగలరు. 8328204200


ఆర్.ఓ.సి.నెం : 06/2025 తేది: 16.03.2025

### గ్రామ పంచాయతి కార్యాలయము, పోరుమామిళ్ల

**బహిరంగ వేలము ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయడము ఏమనగా 2025-2026 సం॥నకు అనగా 01.04.2025 నుండి 31.03.2026 వరకు వై.యస్.ఆర్ పోరుమామిళ్ళ మండలము పోరుమామిళ్ళ గ్రామపంచాయతికి చెందిన రూములు, రేకులషెడ్, గాంధీసెంటర్ రూములు మరియు గాంధీసెంటర్ వద్దనున్న ఖాళీస్థలము, బస్టాండ్, యూరినలూములు, రీడింగ్ రూములు, మా రూములు మరియు మందబావీరూముల దగ్గరనున్న ఖాళీస్థలములను ఇచ్చుటకు తేది. 26.03.2025 బుధవారము ఉదయం 10.00 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయములో పంచాయతీ కార్యదర్శి వారిచేగాని లేక వారి అనుమతి వారిచేగాని, బహిరంగ వేలము వేయబడును. వేలములో పాల్గొనువారు డిపాజిట్ నగదురూపంలో ఆఫీసులో చెల్లించి రసీదు పొంది వేలములో పాల్గొనవలెను.

| వ.నం. | వివరములు | చెల్లించవలసిన డిపాజిట్టు | ఆస్థి విలువ సర్టిఫికెట్టు |
|---|---|---|---|
| 1. | మార్కెట్ రూములు 1 నుండి 7 వరకు నెలకి 1కి. | 40,000 | 1,00,000 |
| 2. | గాంధీ బొమ్మ సెంటర్ రూములు 1 నుండి 9 వరకు వరకు నెలకి 1కి. | 50,000 | 1,00,000 |
| 3. | మందబావి రూములు 1 నుండి 8 వరకు నెలకి 1కి. | 50,000 | 1,00,000 |
| 4. | రీడింగ్ రూములు 1 నుండి 3 వరకు నెలకి 1కి. | 40,000 | 1,00,000 |
| 5. | యురినల్స్ రూములు 1, సంవత్సరము 1కి. | 13,000 | 1,00,000 |
| 6. | రేకుల షెడ్ 1 | 50,000 | 1,00,000 |
| 7. | బస్టాండ్ 1 | 50,000 | 1,00,000 |
| 8. | గాంధీ బొమ్మ సెంటర్ ఖాళీ స్థలము 1 | 50,000 | 1,00,000 |
| 9. | గాంధీ బొమ్మ సెంటర్ ఖాళీ స్థలము 2 | 50,000 | 1,00,000 |
| 10. | మందబావి ఖాళీ స్థలము 1 | 30,000 | 1,00,000 |
| 11. | మందబావి ఖాళీ స్థలము 2 | 30,000 | 1,00,000 |
| 12. | మందబావి ఖాళీ స్థలము 3 | 30,000 | 1,00,000 |

షరతులు : వేలము షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయ పని వేళలో తెలుసుకొనవచ్చును.

పి.రవిశంకర్ రెడ్డి
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితి, పోరుమామిళ్ల.

## బహుజన రాజ్య పితామహుడు కాన్సీరామ్



కాన్సీరామ్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు

**పీలేరు మార్చి 15 ప్రభాతవార్త:**
బహుజన రాజ్యపితామహుడు కాన్సీరామ్ అని అన్నమయ్య జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. శనివారం పీలేరు బాస్ కార్యాలయంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో కాన్సీరామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ కాన్సీరామ్ రక్షణ శాఖలో సైంటిస్ట్‌గా పని చేస్తూ అంబేద్కర్ రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని చదివి, దాని ప్రభావంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడని చెప్పారు. తరతరాలుగా బహుజనులను అణిచివేస్తున్న కుల వివక్షను ఎదిరించి బహుజన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన మహానేత, బహుజన రాజకీయ వ్యూహకర్త కాన్సీరామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, పల్లెపోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, సంధిపాగు రామకృష్ణ, హరీష్, కిషోర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సుందరీకరణ పనులు పరిశీలన

**కడప కార్పొరేషన్, మార్చి 15 ప్రభాతవార్త:**



కడప నగరం పుట్లంపల్లె చెరువు కట్ట సుందరీ కరుణ పనులను టిడిపి15 డివిజన్ ఇంచార్జి కొండా సుబ్బయ్య, కడప నగర టిడిపి సీనియర్ నాయకుడు కొండ్రెడ్డి జనార్ద న్ రెడ్డిలు శనివారం పరిశీలించారు. రాకపోకలకు అంతరాయం లేకుండా, వర్షాకాలం ఆరంభం అయ్యేలోపు పనులు పూర్తి చేయాలని పుట్లంపల్లె గ్రామస్తులు, ఆయకట్ట దారులు కోరారు. సంబంధిత. అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి నాణ్యతతో కూడిన పనులు పూర్తయిలా చేస్తామని టిడిపి నేత కొండ సుబ్బయ్య చెప్పారు.

## ఊట చెరువు 4, 5 టిసిలు సస్పెన్షన్

**సుండుపల్లె, మార్చి15, ప్రభాతవార్:**
మండల పరిధిలోని తిమ్మసముద్రంలో గతంలో జరిగిన ఊట చెరువు ఎన్నికకు సంబంధించి అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ విచారణ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. సదరు ఘటనపై పూర్తి విచారణ చేసిన తరువాత ఎన్నికల నియమావళిని అతిక్రమించి ఎన్నిక కాబడినట్లు ప్రకటించిన టీసి నాలుగో మరియు టిసి ఐదులుగా నియమితులైన అబ్దుల్ తవాబ్, ఖలీలుల్లాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఊట చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన లగిశెట్టి రామాంజులు హైకోర్టులో ఉత్తర్వు ప్రకారం టీసి మూడుగా కొనసాగుతారని కలెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వులలో తెలియజేశారు. సదరు ఘటన పట్ల ఫిర్యాదుదారుడు టిసి 2 ఆయన మోహన్ నాయుడు స్పందిస్తూ కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు చోటు ఉండదు అని నిరూపించి సంఘటనపై స్పందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

## మామిడి పూత రక్షణకు చర్యలు తీసుకోవాలి

**పీలేరు మార్చి 15 ప్రభాతవార్త:**
పీలేరు మండలంలోని అన్ని ప్రాంతాల్లోనూ విస్తారంగా విరగబూసిన మామిడి పూతను కాపాడుకోడానికి తగు చర్యలు తీసుకోవాలని పీలేరు ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పూత, పిందె దశల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించేందుకు ఆదివారం స్థానిక సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మామిడి కాయల్లో నాణ్యత తగ్గకుండా వుండేందుకు ఫ్రూట్ కవర్ల వాడకంపై కూడా ఒక రోజు శిక్షణ ఉంటుందని ఆయన చెప్పారు. పీలేరు, కెవి పల్లి, కలకడ, ఇతర మండలాల రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అన్ని రకాల సందేహాల నివృత్తికి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

## స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ దివస్



**రామసముద్రం మార్చి 15ప్రభాతవార్త**
స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రతినెలా మూడవ శనివారం రోజున నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రామసముద్రం మండల కేంద్రంలో ఇరుగేషన్ సురేష్, శ్రీధర్ ఎంపీడీవో భానుప్రసాద్, ఏపిఎం సాంబశివ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు మండల కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సర్కిల్ నందు మానవహారం నిర్వహించడం జరిగింది. ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేయడం జరిగింది.ఎంపిడిఓ భానుప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు వీధులు,, కాలువలు, ఇంటి ఆవరణ లు పరిశుభ్రం గా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ(ఇరిగేషన్ )సురేష్ ఎంపీడీవో భానుప్రసాద్, ఇరుగేషన్ ఏ ఈ శ్రీధర్,ఏపిఎం సాంబశివ, సి సి గంగాధర్, పంచాయతీ కార్యదర్శి మునిస్వామినాయక్ చాంద్ బాషా,ఎంఆర్సి సిబ్బంది, వెలుగుసమాఖ్య సిబ్బంది, మెడికల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పెన్నుల వితరణ

**పులివెందుల రూరల్, మార్చి 15, ప్రభాతవార్త :**
పట్టణంలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయి చైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ నారాయణరెడ్డి సహకారంతో పులివెందుల తాలూకా వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు వి. రామ్ లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 10 వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలనే ఉద్దేశంతో పులివెందులోని గవర్నమెంట్ ప్రవేట్ పాఠశాలలో చదువుతున్న 10 వ తరగతి విద్యార్థులకు పెన్నులు అందించారు. అనంతరం చైతన్య జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ నారాయణరెడ్డి, రామ్ లక్ష్మణ్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి లు మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ప్రతిభ చూపాలని విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులివెందుల తాలూకా వైసిపి యువజన విభాగం నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్ర... స్వచ భారత్



**సుండుపల్లి, మార్చి15, ప్రభాతవార్త:**
పొలిమేరపల్లి గ్రామం జడ్పిహెచ్ హైస్కూల్ నందు స్వచ్ భారత్‌స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో బిజెపి సుండుపల్లి మండల అధ్యక్షులు యస్. వి. రమణ గౌడ్ మాట్లాడుతు ఈ స్వచ్ఛత ఉద్యమంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, దీన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చారు. ప్రభుత్వాధికారుల మొదలుకొని జవానులు, బాలీవుడ్ నటీనటుల నుంచి క్రీడాకారులు, పారిశ్రామికవేత్తల నుంచి ఆధ్యాత్మిక గురువుల దాకా పాల్గొంటున్నారు. స్వచ్ఛ భారత్ సందేశాన్ని చేరవేయడానికి తరచుగా వీధి నాటకాలు ప్రదర్శిస్తున్నారు; సంగీత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంతరాజు పల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం కె శ్రీనివాసులు టెక్నికల్ అసిస్టెంట్ కె ఆంజనేయులు పంచాయతీ సెక్రెటరీ శరత్ కుమార్ రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ విజయలక్ష్మి బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర

**సుండుపల్లె, మార్చి 15, ప్రభాతవార్త:**



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని డాక్టర్ శేఖర్ రెడ్డి తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం తన సిబ్బందితో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అందరూ కలిసి పి హెచ్ సి లో చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో విజయవాడ హెల్త్ హెడ్యుకేటర్ కే. శివరామరాజు, పీహెచ్సీ డాక్టర్ రుబీనా,ఎం పి హెచ్ఈఓ వీరనారాయణ, సూపర్వైజర్ ఎల్లమ్మ, నరేష్, అనూష పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి




**పులివెందుల రూరల్, మార్చి 15, ప్రభాతవార్త :**
ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం" అనే అంశం పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు కళాశాల ప్రధాన భవనం వెనుక భాగం లో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి చెత్త కుండీలు లో వేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ అసోసియేట్ డీన్ అరుణ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, పి.డి డాక్టర్ రాజశేఖర్, కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం




**వీరపునాయునిపల్లి, మార్చి 15, ప్రభాతవార్త :**
వీరపునాయునిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మొహమ్మద్ తాహ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం ఒక్కొక్క థీమ్ తో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఇందులో భాగంగా ఈ నెల కి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్లను నివారించండి, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి అనే అంశం పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్లను నివారించడం పై, వాటి వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ, వాటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి హాని కలిగించకుండా, పునర్వినియోగం చేయగలిగే పత్తి, జనపనార, లేదా ఇతర సహజ ఫైబర్‌తో చేసిన సంచులు, మరియు ప్లాస్టిక్ బదులు బయోడిగ్రేడబుల్ పదార్థాలతో చేసిన సంచులను ఉపయోగించడం పై, తడి చెత్త, పొడి చెత్త లను వేరు చేయడం పై ప్రజల్లో అవగాహన కల్పించాలని మన మండలాన్ని ప్లాస్టిక్ రహితంగా చేసి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరు ముందుకు రావాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ ధనలక్ష్మి, పిహెచ్సి స్టాఫ్, ఏఎన్ఎం లు, ఇతర ఆరోగ్యసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

**బద్వేలు, మార్చి 15 ప్రభాతవార్త**
ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బొమ్మన ఫౌండేషన్ డైరెక్టర్ బొమ్మన విజయ్, డెమొక్రటిక్ పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు రవి శంకర్ లు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం నందు పదవ తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థినులకు బొమ్మన ఫౌండేషన్ సహకారంతో పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో మంచి ప్రతిభను కనపరిచి మంచి మార్కులు సాధించి, భవిష్యత్తులో మీకు ఇష్టమైన రంగాలలో స్థిరపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థికి పదవ తరగతి ఎంతో కీలకమని ఇక్కడ వచ్చే మార్కులతోనే వారి అభివృద్ధి ఆధారపడి ఉంటుందని కావున ప్రతి విద్యార్థి బాగా చదువుకుని మంచి మార్కులు సాధించి పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదవ తరగతి పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతిని బొమ్మన ఫౌండేషన్ ద్వారా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా .ప్రిన్సిపల్ సునీత విద్యార్థులకు సహకారం అందించిన బొమ్మన ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేదవిద్యార్థినీ ,విద్యార్థులకు సహకారం అందించాలని కోరారు .ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి వెంకటేష్, యర్రంరెడ్డి, శేఖర్ రాయల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



## టెన్త్ పరీక్షలు నిర్వహణకు సర్వం సిద్ధం

**కలకడ మార్చి 15 ప్రభాతవార్త :**
టెన్త్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ మునీంద్ర నాయక్ తెలిపారు.ఈనెల 17వ తేదీ నుండి జరగనున్న టెన్త్ పరీక్షలకు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ మూడు కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు కావలసిన సరంజామా ను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పరీక్షా కేంద్రం నందు 201 మంది, మోడల్ పరీక్ష కేంద్రం నందు192, మంది కోన పరీక్ష కేంద్రం నందు 60 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు మండలంలోని కలకడ తెలుగు, ఉర్దూ, ఉన్నత పాఠశాలలు, ఎర్రయ్యగారిపల్లి, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, పాపి రెడ్డి గారి పల్లి, విశ్వ జ్యోతి ఉన్నత పాఠశాలలకు చెందిన 453 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణలో కలకడ పరీక్ష కేంద్రంలో సిఎస్‌గా చమల్ రాయుడు, డివోగా శివకుమార్, ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రానికి సీఎస్‌గా రామాంజులు నాయక్, డిఓగా శంకర్ నాయక్, కోన కేంద్రానికి సిఎస్ గా రాము, డిఓగా సోమశేఖర్‌రెడ్డిలు వ్యవహరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అయితే ఈ పరీక్షల నిర్వహణలో ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు 10వ తరగతి పరీక్షల నిర్వహణకు హాజరు కావడం గమనార్హం.

## ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం ఆరోగ్యాన్ని కాపాడుదాం

**రైల్వే కోడూరు మార్చి 15 ప్రభాతవార్త...**



పట్టణంలో ప్లాస్టిక్ ను నిషేధించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగార్జున, ఈవో ప్రసాద్ రావులు మాట్లాడుతూ కోడూరు పట్టణంలో ప్రతి ఒక్క షాపు యజమాని ప్లాస్టిక్ ను నిషేధించి భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. పంచాయితీ నిబంధనల ప్రకారం ఎవరైనా ప్లాస్టిక్ ను వాడితే తప్పక కేసులు మరియు జరిమానా విధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి టోల్గేట్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బుడిగి శివయ్య, దారల చంద్రశేఖర్, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, ఆనాల చంగల్ రెడ్డి, రామకృష్ణా, నాయిని హరికృష్ణ రెడ్డి, సుబ్బయ్య, ఆర్ వి రమణ, తదితరులు తోపాటు నార్జాల హేమ్ రాజ్, నవీన్, కొప్పరపు అరవింద్, ఉంగరాల బ్రదర్స్, మేడ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానం

**పెనగళూరు, మార్చి 15, ప్రభాతవార్త;**



మండలంలోని మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో 2025, 26 విద్యా సంవత్సరమునకు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశము కొరకు10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు ఓసి బిసి ఈడబ్ల్యుసి విద్యార్థులు రూ.200 లు, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.150 లు చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సహజ బ్లెస్సి తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకి దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆమె తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్ చేసుకొనుటకు 17.03.2025 నుండి 22.05.2025 తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. కావున అడ్మిషన్లు కోరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు.

## రంజాన్ ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్ఐ

**పెనగలూరు, మార్చి 15, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని పి కొత్తపల్లి, ఇండ్లూరు మైనారిటీ ప్రజలు రంజాన్ పర్వదినం సందర్భంగా జరుపుకునే సామూహిక ఈద్గా ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై రవి ప్రకాష్ రెడ్డి మైనారిటీ పెద్దలకు సూచించారు. స్మశాన ప్రాంగణంలో గల కొత్త, పాత ఈద్గ స్థలాలను ఆయన పరిశీలించారు. పురాతన కాలంలో నిర్మించిన పాతఈద్గా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎగు కొత్తపల్లికి చెందిన భాష కుటుంబ సభ్యులు 10 లక్షల రూపాయల నిధులతో మదనపల్లి నుండి రాళ్లు తెప్పించి 15 సంవత్సరాల కిందట కొత్త ఈద్గాను నిర్మించి జాతికి అంకితం చేశారు.

## ప్రపంచ వినియోగదారుల హక్కులు అవగాహన సదస్సు




**ప్రొద్దుటూరు మార్చి 15 ప్రభాతవార్త**
వికసిత ఫౌండేషన్ మరియు నెహ్రూ కేంద్ర ఆధ్వర్యంలో సృజన్ ఇన్స్టిట్యూట్ నందు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వినియోగదారులు తమ హక్కుల గురించి బిజినెస్ మార్కెటింగ్ వ్యవస్థ గురించి తెలుసుకొని హక్కు కలిగి ఉండాలని సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత వంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సమాజంలో న్యాయం పొందే హక్కు 1985లో జనరల్ అసెంబ్లీ ఆమోదించిందని, అన్ని రకాల వినియోగదారులకు సమానంగా వర్తించాలని అడ్వకేట్ సిద్దేశ్వరమ్మ వివరించారు. సమాధానమైన న్యాయమైన ధరలకు పొందే హక్కు గురించి ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మీదేవి, జ్యోతి డ్యాన్సర్ మహి విద్యార్థులు, లెక్చరర్స్ పాల్గొన్నారు.

## గత వైకాపా పాలనలోనే అసాంఘిక కార్యక్రమాలు

**కడప కార్పోరేషన్, మార్చి 15 ప్రభాతవార్త:**
కడప నగరంలో జూదం, గంజాయితో పాటుగా ఇతర అసాంఘిక కార్యకలాపాలు ప్రారంభమైనదని వైసీపీ హయాంలోనే అని టీడీపీ 24వ డివిజన్ ఇంచార్జ్ అశోక్‌రెడ్డి, టిడిపి నాయకులు బొమ్మిశెట్టి చంద్రాలు తెలిపారు. కాని వైసిపి నాయకులు మాత్రం దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్య బట్టారు. శనివారం కడపలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, వైసీపీ నేత దేవిరెడ్డి ఆదిత్యల ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. గత ఎన్నికల్లో వారు తమ ఇంటికి వచ్చి మద్దతు కోరారన్నారు. జిల్లాలో నేర చరిత్ర వచ్చింది వైసీపీ హయాంలోనే అని ఆరోపించారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పార్టీ నేత శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని మరిచిపోలేదన్నారు. ట్రిబుల్ స్టార్‌గా ఉన్న నాటి అధికారి వెనుక ఏ శక్తి ఉందో తెలపాలన్నారు. పోలీసులు తనకు 41ఏ నోటీసులు ఇచ్చి విచారించడం జరిగిందన్నారు. తాను చేసిన నేరమంటూ ఏదీ లేదన్నారు. సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టిడిపి నేత శ్రీనివాసులురెడ్డి లు పోలీసుల ద్వారా అసాంఘి కార్యకలాపాలను కట్టడి చేశారని కొనియాడారు. కడపను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న వారి వెంటే ఉంటూ టిడిపిలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. తమపై లేనిపోని ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



## పరిశుభ్రతే ప్రగతికి మూలం




**రాయచోటి మార్చి 15 ప్రభాతవార్త**
బాల్యం నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సదుద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారమైన 15వ తేదీన స్థానిక మాసాపేట సుగవాసి రాజారాం ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర. స్వేచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయాన ప్రార్థన సమయంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు జానకి ఆధ్వర్యంలో చేయించడం జరిగినది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతవల్ల పర్యావరణంతో పాటు భూమి, జలం, సముద్రాలు కలుషితమైపోయాయన్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు శెట్టెం ఆంజనేయులు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ధరణిని భవిష్యత్ తరాలకు అందించాలంటే మన తరం వారు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. తర్వాత వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్వరయ్య మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల పిల్లలు ఉపాధ్యాయులు స్వచ్ఛ ఆంధ్రా ర్యాలీని నిర్వహించారు. తదనంతరం పాఠశాల పరిసరాలను పిల్లలు ఉపాధ్యాయులు పాఠశాలలోని ఆయాలు అందరూ శుభ్రం చేశారు.

## కలకడలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం



మానవహారం నిర్వహించిన దృశ్యం

**కలకడ మార్చి 15 ప్రభాతవార్త :**
కేంద్రమైన కలకడలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమము నిర్వహించినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లా కలకడ మండలం కలకడ గ్రామపంచాయతీ 15 తేదీ మూడవ శనివారం సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమం సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై గ్రామపంచాయతీ కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్దకు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భారీ ర్యాలీగా చేరుకోవడం జరిగినది. తదుపరి మానవహారము ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయంలో ప్రజలచే స్వచ్ఛ గ్రామ సభను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సదరు చిరు వ్యాపారులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. తర్వాత ర్యాలీ నందు పాల్గొన్న వారిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భరత్ కుమార్ రెడ్డి, ఎంఈఓ మునీంద్ర నాయక్ కలకడ సర్పంచ్ టి.పారిజాన్ జావాద్ అలీ ఖాన్, మరియు బాలయ్యగారిపల్లి సర్పంచ్ విశ్వనాథనాయుడు పాల్గొన్నారు.

## మహిళలు సహాయ డెస్క్‌ను సద్వినియోగం

**వాల్మీకిపురం, మార్చి 15 ప్రభాతవార్త :**



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం ఏర్పాటు చేసిన మహిళల సహాయ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని స్థానిక ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్లో మహిళల సహాయ డెస్క్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు కరపత్రాలను పంపిణీ చేసి మహిళలు రక్షణ కోసం డెస్క్ ను సంప్రదిస్తే ప్రయోజనం పొందే విషయాలను వారికి వివరించారు మహిళలకు ఏ అవసరం వచ్చినా, ఆపదలో ఉన్నా తక్షణమే 112 నెంబరుకు డయిల్ చేయాలని, అలాగే 181, 1930, 1098ల నెంబర్లకు సైతం డయిల్ చేసి పోలీసుల నుంచి సహాయంతో పాటు రక్షణ పొందవచ్చునని సూచించారు. ప్రతి మహిళా ఈ నెంబర్లను గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు వేణుగోపాల్, అనిత, స్థానిక మహిళలు ఆది తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

**వాల్మీకిపురం, మార్చి 15. ప్రభాతవార్త :**



విద్యార్థులకు అవగాహన

ప్రతి ఒకరూ శ్రమదానం చేద్దాం మన వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేసుకుందామని తెదేపా రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పంచాయతీ కార్మికులు, విద్యార్థులు, స్థానికులచే ఎంపీడీవో మనోహర్రాజు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తదుపరి సర్పంచి గంగులమ్మ, ఉపసర్పంచి కేశవరెడ్డి, తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులతో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డులో శ్రమదానం చేసి చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో రవీంద్రనాథ్, తెదేపానాయకులు, పంచాయతీ కార్మికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

### తహశీల్దార్ భీమేశ్వరరావు



**పీలేరు మార్చి 15 ప్రభాతవార్త:**
పీలేరులో రోజురోజుకు మండుతున్న ఎండలు తీవ్రతరం కానున్న దంతో పట్టణ ప్రధాన కూడళ్ళు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, జన సంచార ప్రదేశాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని పీలేరు మండల తహశీల్దార్ భీమేశ్వరరావు అన్నారు. అంతేకాకుండా ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రజా ప్రతినిధులు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలువ పందిళ్ళు వేసి మట్టి కుండలో త్రాగునీరు అందించాలని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి రికార్డ్ స్థాయిలో ఎండలు మండుతూ ఉండడంతో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని అదే క్రమంలో ప్రజలు అనవసరంగా ఎండలకు తిరగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ తగినంతగా నీరు తాగుతూ ఉపశమనం పొందాలని తహశీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్మోహన్ పాల్గొన్నారు.

## స్వచ్ఛతను పాటిస్తాం అభివృద్ధిని సాధిద్దాం

**రైల్వే కోడూరు మార్చి 15 ప్రభాతవార్త...**



పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరపురం కాలనీలలో లక్ష్మీపురం కాలనీలలో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా శనివారం కోడూరు రేంజర్ పిప శ్యాంసుందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్ సింగ్, కోడూరు సబ్‌డిఎఫ్ఓ సుబ్బరాజు ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన అన్నారు. వెంకటేశ్వరపురంకాలనీ, లక్ష్మీపురం కాలనీ గ్రామస్తులతో పరిసరాల పరిశుభ్రతను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో ఉన్న అపరిశుభ్రతను తొలగించి పరిసరాల పరిశుభ్రతను పట్టిష్టంగా పాటించాలని గ్రామస్తుల చేత ప్రతిజ్ఞను చేయించి, డిప్యూటీ రేంజర్ గురవయ్య, ఎఫ్‌బి ఓలు పాల్గొన్నారు.

## శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

రామసముద్రం, మార్చి 15 ప్రభాతవార్త



చెంబకూరు గ్రామపంచాయతీ కేంద్రంలో జరుగుతున్నటువంటి శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవం, కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి మండలంలోని భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు, అర్చకులు, పాల్గొన్నారు. మండలంలోని భక్తులు మరియు కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మరియు ఎగువపల్లె దిగువపల్లి గ్రామాలలోని భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## వైభవంగా ముక్కంటేశ్వరస్వామి తిరుణాళ్ళ



రామసముద్రం మార్చి 15 ప్రభాతవార్త

మండలంలోని నరసాపురం గ్రామంలో వెలిసి ఉన్న ముక్కంటే శ్వర స్వామి తిరుణాళ్ళు అత్యంత వైభవంగా గ్రామపెద్దలు, గ్రామప్రజలు ఘనంగా నిర్వహించారు. 14 తేదీన ప్రారంభమైన తిరణాలు ఉత్సవాలు మూడు రోజులుపాటు సాగాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం రాత్రి వరకు స్వామి దర్శనం కొన సాగింది. ధ్వజస్థంభంవద్ద, ముఖద్వారం వద్ద పూలతో తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలు అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బెంగళూరు నుండి పలురకాల పుష్పాలు తెప్పించి అలంకరణ చేశారు. స్వామి పుష్పపల్లకిని పలు రకాల పుష్పాలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. పలు రకాల బానాసంచాలు తమిళనాడు నుండి తెప్పించారు. స్వామివారు పురవీధుల్లో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు స్వామివారికి మంగళ హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రముఖ పార్టీ నాయకులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కర్ణాటక, తమిళనాడు నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. నరసాపురం గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు కోసం గ్రామస్థులు భారీ ఏర్పాట్లు చేశారు. తిరణాల సందర్భంగా డిఎస్పీ కొండయ్య దర్బార్ నాయుడు, సీఐ సత్యనారాయణ, ఎస్సై జి. రవికుమార్ ఆధ్వర్యంలో భారీబందోబస్తు ఏర్పాటు చేశారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఐ



లక్కిరెడ్డిపల్లి : మార్చి 15 ప్రభాత వార్త

మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామ ఖస్బా లోని ఉన్న తీవ్రమైన తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక గ్రామ సచివాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా పందిళ్లపల్లి కస్బాలోని దాదాపు 400 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారు. ఇందులో ప్రధానంగా మైనారిటీ కుటుంబాలు 100కు పైనే ఉన్నాయి. వీళ్ళందరూ కూడా ఉపవాస దీక్షలో ఉంటూ ఒక పక్క తీవ్రమైన త్రాగునీటితో ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు గాని స్థానిక సర్పంచి గాని ఎవరు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. గత పాలకులు మాత్రం వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని గొప్పలు చెప్పారు తప్ప ఆచరణలో ఎక్కడ సాధ్యం కాలేదు అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తీవ్రమైన తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలపై మండల స్థాయి అధికారులు సదర్శించి పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దర్బార్, పరానా, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రక్షణకై శక్తి యాప్ పై అవగాహన సదస్సు



బద్వేలు అర్బన్ ,మార్చి 15, ప్రభాతవార్త

మహిళల ఆత్మ రక్షణకై శక్తి యాప్ రూపొందించబడిందని, ఈ యాప్ ను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని బద్వేల్ సి.ఐ. రాజగోపాల్ అన్నారు. శనివారం శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ , పీజీ కళాశాలలో శక్తి యాప్ పై జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఇందులో భాగంగా ఆయన యాప్‌పై అవగాహన కల్పిస్తూ మహిళలు అత్యవసర పరిస్థితులలో ఈ యాప్‌ని ఎలా ఉపయోగించాలో వివరించారు. శక్తి యాప్ ప్రత్యేకతలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరూ ఒక టీము గా ఏర్పడి ప్రజలందరికీ శక్తి యాప్ గురించి వివరిస్తూ వారిలో అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో నేరాలు పెరుగుతున్నాయని వీటిని నివారించడానికి సాంకేతిక అవసరం ఎంతో ఉందని, అందుకే ప్రభుత్వం ఈ యాప్ ని తీసుకొచ్చిందని, విద్యార్థులు ఈ యాప్ ని సద్వినియోగపరచుకోవాలని బద్వేల్ ఎస్సై రవికుమార్ అన్నారు. ప్రతి మహిళ తమని తాము రక్షించుకునేకి ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం విద్యాసంస్థల పరిపాలన అధికారి వెంకట సాయి కృష్ణ, బాల ఓబులేష్, డాక్టర్ అశోక్, కబీర్, అధ్యాపకులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌కు అమెరికా యూనివర్శిటి డాక్టరేట్

కురబలకోట, మార్చి 15 ప్రభాతవార్త :



రఘునాథ్‌రెడ్డిని అభినందిస్తున్న ఛైర్మెన్

ఉమ్మడి చిత్తూరుజిల్లా అంగళ్ళుకు సమీపంలోని విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.రఘునాథ్‌రెడ్డికి యూనివర్శిటి ఆఫ్ సెంట్రల్ ఆమెరికా నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఈయన పెద్దమండ్యం మండలం వెలిగల్లుగ్రామం వ్యవసాయ కుటుంబం లక్ష్మిదేవమ్మ, వెంకటరమణారెడ్డిల కుమారుడు. ఎస్‌వి యూనివర్శిటిలో పిజి అదే విధంగా పబ్లిక్ అడ్మినిస్టేట్‌ను పూర్తి చేశారు. బోధనావృత్తిపై ఆసక్తి ఉండడంతో 2000లో తంబళ్ళపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆద్యాపకులుగా పనిచేశారు. 2005లో విశ్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతా విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహించి విద్యాభివృద్ధికి కృషిచేశారు. సేవా కార్యక్రమాల్లోనూ వివిధ సంస్థల నుంచి ప్రసంశాపత్రాలతో పాటు అవార్డులను పొందారు. ఈయన సేవలను గుర్తించి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ టీచర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోయూనివర్శిటి ఆప్ సెంట్రల్ అమెరికా గౌరవ డాక్టరేట్‌ను పొందారు. రఘునాథ్‌రెడ్డిని విశ్వం విద్యాసంస్థల ఛైర్మెన్ మలిపెద్ది ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

# ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

పీలేరు మార్చి 15 ప్రభాతవార్త:



ఎంపీడీవో ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో శివశంకర్, టీడీపీ శ్రేణులు, పారి శుద్ధ కార్మికుల సంయుక్త ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓవైపు పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూ, మరోవైపు ప్రజారోగ్యాన్ని కాపాడుకుంటూ, ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దడానికి, పర్యావరణాన్ని రాదానికి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. పగిలిన కుండలు, బిందెలు, ఎక్కడపడితే అక్కడ పడేయకుండా, అందులో నీరు నిల్వ కాకుండా తగిన జాగ్రత్తలు వహించాలని చెప్పారు, టెంకాయ చిప్పలు, పగిలిన కుండలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా, జాగ్రత్తలు వహించాలని సూచించారు. చేతి పంపులు కుళాయిల దగ్గర కూడా నీరు నిల్వకాకుండా చూడా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. వీటిల్లోనే దోమలు లార్వాను ఉత్పత్తి చేసి తద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయని ఆయన అన్నారు. టిడిపి రాష్ట్ర బిసి కార్యదర్శి పురం రామూర్తి మాట్లాడుతూ ప్రజలు బాధ్యతగా వ్యవహరించి వ్యర్థాలు, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పడేయకుండా పంచాయతీ వాహనం వచ్చినప్పుడు వెయ్యాలని, పారిశుద్ధ్య, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ ప్రముఖ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, ఈఓపిఆర్డ్ లతీఫ్ ఖాన్, చాంద్ బాషా, సురేష్, పంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, పురుషోత్తం రెడ్డి, బందార్ల పల్లె బాబు రెడ్డి, రహంతుల్లా పంచాయతీ, సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఐపి అవుట్‌రిచ్ మిషన్‌పై సదస్సు




మిట్స్ వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న దృశ్యం

కురబలకోట, మార్చి 15 ప్రభాతవార్త :

అంగళ్ళుకు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మిట్స్ మేథో సంపత్తి సౌకర్యాల కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ ఐపి అవుట్‌రేచ్ మిషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు, ఔత్సాహిక వ్యవస్థాపకులలో మేథో సంపత్తి హక్కుల గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఐపిఆర్ ట్రైన్ డైరెక్టర్ అశోక్ దొప్పలపూడి జ్యోతి ప్రజ్వళనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేటెంట్‌లు, కాపీరైట్లు, ట్రేడ్‌మార్కుల ముఖ్య అంశాల గురించి వివరించారు. భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న ఐపి ల్యాండ్ స్కేప్‌పై విలువైన అతృష్టాలను అందించారు. ప్రతికళాశాలకు పేటెంట్ ఉత్పత్తి, పరిశోధనా బలం అందులో ఉన్న గ్రోతును, విస్తృతిని ఆయన వివరించారు. పెటెంట్ల ఆవిష్కరణ వాటిపనితీరును మధోసంపత్తిని వర్తిస్తాయని ఎలా పనిచేస్తుందో, ఎలా ఉపయోగించపడుతుందన్న విషయాలను ఈ కార్యక్రమంలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.తుల సీరామ్‌నాయుడు, కోఆర్డినేటర్ డాక్టర్ పి.శివయ్య, అసోసియేట్ డీన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై ప్రజలకు అవగాహన

బద్వేలు, మార్చి 15 ప్రభాతవార్త



ప్రజలు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలంటే తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి తన అవసరం ఎంతైనా ఉందని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మరియు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం శనివారం పట్టణంలోని ఆరవ వార్డులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రితేష్ రెడ్డి (స్పెషల్ డ్రైవ్ శానిటేషన్) ఇంటింటి చెత్త సేకరణ, తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట మొదలగు కార్యక్రమాలతో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు బదులు గా ప్రత్యామ్నాయంగా వాడే వస్తువుల పైన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతరామిరెడ్డి, కౌన్సిలర్ సుధామణి, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, మునిసిపల్ సిబ్బంది సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం.



స్వచ్ఛత ఆవశ్యకత పై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది.

చిట్వేలి, మార్చి 15,ప్రభాతవార్త:

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చిట్వేలి లో శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. అన్ని గ్రామాలలో కార్యాలయాలు, పాఠశాలలో సంబంధిత అధికారులు స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. స్వర్ణ పంచాయతీస్వచ్ఛ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా చిట్వేలి గ్రామపంచాయతీలో ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన వీధులలో ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను సేకరించి వారికి అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను ఉపయోగించవద్దని దుకాణదారులకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛత సాధించేందుకు ప్రజలందరి సహకారం అవసరమని, స్వచ్ఛత పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి ఏ.పి.ఓ చంద్రకళ, పంచాయతీ సిబ్బంది నరసింహులు, వెంకటేష్, మస్తానయ్య, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నివారిద్దాం...ఆరోగ్యంగా జీవిద్దాం

కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి పిలుపు

మదనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్థి పలికి, ఆరోగ్యంఠ జీవిద్దామంటూ కురవంక ప్రజలకు సర్పంచ్ పసుపులేటి చలపతి శనివారం పులపునిచ్చారు. కురవంక పంచాయితీ పరిధిలో స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని పంచాయితీ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతి మాట్లాడుతూ నెలలో ప్రతి మూడవ శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ అధికంఠ వడడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతకరమైన జబ్బులు సోకే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి షబానా, వార్డు మెంబర్లు క్రిష్ణమూర్తి, నాగరాజు, బివైఎస్ పునీత్, పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దినస్




సంబేపల్లి మార్చి 15 ప్రభాతవార్త..

స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలం అన్న సూత్రాన్ని అనుసరిస్తూ స్వచ్ఛంద స్వచ్ఛ దినం కార్యక్రమంలో భాగంగా శనివారం సంబేపల్లి మండల కేంద్రంలో స్వచ్ఛ సేవ నోడల్ ఆఫీసర్ సురేష్ ఎంపీడీవో రామచంద్ర మాజీ సర్పంచ్ మండల నాయకులు నాగేశ్వర్ నాయుడు ఏపీఎం సంజీవరాజు ఏపీవో రెడ్డి జోహార్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు మండల పరిషత్ కార్యాలయం నుండి పురవీధుల్లో తిరుగుతూ స్వచ్ఛభారత్ పాటిద్దాం ప్లాస్టిక్ కవర్ నివారిద్దాం అంటూ నినాదాలతో ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ స్వచ్ఛంద స్వచ్ఛభారత్ పై ముఖ్యమంత్రి సన్నివేశాన్ని వినిపించారు సందర్భంగా మాజీ సర్పంచ్ మండల టిడిపి నాయకులు నాగేశ్వర్ నాయుడు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్రత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంత ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దినస్ కార్యక్రమం ప్రారంభించారు అని అన్నారు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛంద స్వచ్ఛతను కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం సూచించింది అన్నారు జిల్లా అధికారులు మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సమాజానికి వ్యక్తిగత బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసి కోటకొండ శ్రీనివాసులు తెలుగుదేశం యువ నాయకులు మట్లి వేణుగోపాల్ నాయుడు అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## వివాద రహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ



పులివెందుల,మార్చి15, ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా వివాధ రహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ చేపడ తామని, కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి అని డ్రాప్ అవుట్స్ నివారనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం వచ్చిందని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టబద్దల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. పులివెందుల ఆర్ అండ్ బి అతిథి గృహంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఏడు మండలాల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థలకు అసౌకర్యం కలగకుండా, తల్లితండ్రుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగుతాం అని అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద బి.వీ 117 రద్దయినా, పాఠశాలల విలీనంపై స్థానిక అభ్యంత రాలు ఉన్నాయని అధికారులతో ఆయన పేర్కొన్నారు. ప్రభు త్వం ప్రతిపాదించిన కొత్త విధానంలో శాటిలైట్ ఫౌండేష నల్ స్కూల్,బేసిక్ ప్రైమరీ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్ మొదలైన ఐదు రకాల పాఠశాలలు ఏర్పాటు చేయడంపై అధికారులతో చర్చించారు. డ్రాప్ అవుట్స్ నివారణ లక్ష్యంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల కేటాయింపు, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించా రు.ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారిసంసుద్దీన్ మరియు మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపదను సృష్టించాలి

పులివెందుల,మార్చి 15,ప్రభాతవార్త :



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి

చెత్త నుంచి సంపదను సృష్టించాలి అని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పూలంగళ్లు సెంటర్ లో చేపట్టిన ^స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివస్‌ఖ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ప్రజల జీవన విధానంలో భాగం కావాలి అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం అనేది మన అందరి బాధ్యత అన్నారు స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పంచాయతీల పరిధిలో చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలు, డంపింగ్ యార్డులు, చెత్తను వేరు చేసే క్రమం వంటి విషయాలను స్వయంగా పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రతి నెలా మూడో శనివారం^స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ఠ పక్కాగా నిర్వహించాలన్నారు. చెత్తను వేరు చేయడం ద్వారా, దాన్ని మళ్లీ పునర్వియోగం కోసం ఉపయోగించడం ద్వారా చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ,మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్,వైస్ ఛైర్మన్ హాఫీజ్,తెదేపా నాయకులు బొజ్జా మైసురా రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తి

చీఫ్ సూపరింటెండెంట్ మర్ల ఓబుల్ రెడ్డి

రాయచోటి మార్చి 15 ప్రభాతవార్త



ఈనెల 17వ తేదీ నుండి నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మర్ల ఓబుల్ రెడ్డి, డిపార్ట్మెంటల్ అధికారి రాజేంద్రప్రసాద్ శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. వీరబల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం రెండు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన ఫ్యాన్లు, వెలుతురు, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోనికి తీసుకురావడం నిషేధించబడినవన్నారు. పరీక్షా కేంద్రంలోనికి చీట్టీలు, పుస్తకాలు కానీ తీసుకొని రావద్దని విద్యార్థులకు సూచించారు.

## ఊటుకూరులో భక్తకన్నప్ప సినిమా యూనిట్



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

శివభక్తుడు, తన రెండు కళ్ళను మహాదేవునికి భక్తితో సమర్పించిన భక్తకన్నప్ప జన్మస్థలిగా భావిస్తున్న రాజంపేట మండలం ఊటుకూరుకు శనివారం భక్త కన్నప్ప సినిమా యూనిట్‌తో కలిసి నటుడు మంచు విష్ణు విచ్చేశారు. ఇక్కడ భక్త కన్నప్పచే ఆరాధించబడినట్టుగా భావిస్తున్న పురాతన శివాలయాన్ని సందర్శించి మంచు విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊటుకూరుకు విచ్చేసిన సందర్భంగా మంచు విష్ణును బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బిజెపి నేతలు మహేష్ నాగరాజు పి కృష్ణ, నరేంద్ర, తోట నగేష్ స్థానిక గ్రామ పెద్దలు మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## సారా తయారీ నియంత్రణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కలకడ మార్చి 15 ప్రభాతవార్త :

సారా తయారీ నియంత్రణపై అవగాహన కల్పించినట్లు అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెన్టెంట్ జోగేంద్ర పేర్కొన్నారు. మండలంలోని దిగుతాండ పంచాయతీ దిగువ తండాలో ఎస్టీలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారు చేయడం నేరమని ఆయన పేర్కొన్నారు. నాటు సారా తయారుచేసి జీవనోపాధి పొందడం చట్టపరంగా నేరమని ఆయన సూచించినట్లు తెలిపారు. మీ జీవనోపాధి కోసం జిల్లా కలెక్టర్ కు మీ సమస్యలు తెలిపే మీకు ప్రభుత్వం నుండి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చినట్టు తెలిపారు.నాటు సారా తయారు చేయడం, అమ్మకాలు చేయడం జీవితాలతో ఆడుకోవడమేనని తెలిపారు.నాటు సారా తాగడం వల్ల జబ్బుల బారిన పడడం, ప్రాణాలను కోల్పోవడమే కాకుండా ఇంటి యజమానులను పోగొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి చెడు వ్యసనాలకు లోను కావడం వల్ల దొంగతనాలు చేయడం నేర్చుకోవడం జరుగుతుందని, ఇందుకోసం ప్రభుత్వం మీకు రుణాలను ఇచ్చి మీ కుటుంబాలను బాగు చేయాలని ఉద్దేశంతో ఉన్నదని సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై చైతన్య, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే స్వచ్ఛ ప్రొద్దుటూరు సాధ్యం

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



ప్రొద్దుటూరు మార్చి 15 ప్రభాతవార్త

పట్టణాన్ని స్వచ్ఛ ప్రొద్దుటూరుగా చేసేందుకు ప్రజలు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ప్రొద్దుటూరుకై తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో నూరు శాతం చెత్తను మున్సిపల్ కార్మికులకే అందించేలాగా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అని, అలాగే చెత్తని ఇచ్చేటప్పుడే తడి చెత్త పొడి చెత్త హానికర చెత్తవేరు చేసి ఇచ్చేలాగా చూడటం, అలాగే ముఖ్యంగా ఒకసారి వాడి పడేసేటువంటి ప్లాస్టిక్స్ ని, అలాగే 120 మైక్రాస్ కంటే తక్కువ మందంగా ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధిస్తూ జ్యూట్ బ్యాగులను ఉపయోగించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమన్నారు. పర్యావరణానికి మేలు కలిగేలా చేయడం తద్వారా పూర్తిగా జీరో వేస్ట్ అంటే వేస్ట్ ప్రొడ్యూస్ అయి దగ్గరే మన కలెక్ట్ చేసుకొని సెగ్రిగేట్ చేసి ఆ సెగ్రిగేట్ చేసిన వేస్ట్ ని ప్రాపర్ గా ప్రాసెసింగ్ చేసి జీరో వేసి ఎన్విరాన్మెంట్ లోకి వచ్చేలాగా ప్రజల్లో అవగాహన కల్పించడం తోనే స్వచ్ఛ ప్రొద్దుటూరు సాధ్యమన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి సహకరించవలసిందిగా కోరారు. స్థానిక జిన్నా రోడ్డు లోని జిలాన్ మోరి నందు దాదాపుగా గత 12 సంవత్సరాల నుంచి పేరుకుపోయిన సిల్ట్ ను ప్రైవేట్ కాంట్రాక్టర్ చే గత నాలుగు రోజుల నుంచి తొలిగింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ దస్తగిరి, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఎస్ నూర్ భాషా, వి సుబ్బరాయుడు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేదంపై మహిళలచే కమీషనర్ ప్రతిజ్ఞ

మదనపల్లె, మార్చి 15 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న కమీషనర్

స్వర్ణాంధ్రా, స్వచ్చాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో శనివారం మున్సిపల్ కమీషనర్ ప్రమీల స్వయంసహాయక గ్రూపు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నేను, నా పరిసరాల పరిశుభ్రతకు ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయిస్తానని, నా వంతు కృషిగా స్వచ్ఛతా కార్యక్రమాల కొరకు శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో మహిళలచే ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నివారిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, పరిశుభ్రతను పాటిద్దామంటూ ప్లాకార్డులను పట్టుకొని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో మెప్మా ఎంఎం మధుసూధన్‌రెడ్డి, ఆర్పీలు, సిసిలు, మహిళలు పాల్గొన్నారు.